
రైతుకు విపత్తి



అన్నదాతపై ప్రకృతి కన్నెర్ర చేసింది. ఈ ఏడాది వరుణుడు కరుణించాడని రైతన్నలు సంబరపడిపోయారు. ఈ ఆనందం వారికి ఎక్కువ కాలం నిల్వలేదు. ఖరీఫ్‌లో సాగుకు సిద్ధమై పత్తి పంటను పండించారు. పంటలు పచ్చగా ఉన్నాయన్న తరుణంలో ఎడతెరిపి లేని వర్షాలు కురిశాయి. పత్తి మొక్కను తెగుళ్లు, పురుగులు, తెల్ల, పచ్చ దోమ వెంటాడుతుండగా.. పత్తి పూత, కాయలు ఎర్రబారి రాలిపోతున్నాయి. వాటిని నివారించేందుకు పిచికారి మందులు వాడినా ఫలితం ఉండటం లేదు. ఇప్పటికే వేలకు వేలు పెట్టుబడులతో అదనపు భారం పడుతోంది. ఈ తెగులు మరింత తీవ్రమైతే పత్తి దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉండటంతో అన్నదాతలు కలవరపాటుకు గురవుతున్నారు.

- తెగులుతో దిగులు
- ఎర్రబారుతున్న పొలాలు
- పూత, కాయలు రాలుతున్నాయ్
- పిచికారి చేసినా ఫలితం ఇవ్వని మందులు
- దిగుబడిపై ప్రభావం

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అత్యధికంగా పత్తి పంట సాగు చేసే జిల్లా కర్నూలు. ఈ ఏడాది ఇప్పటివరకు 2,21,356 లక్షల హెక్టార్లలో పత్తి సాగైందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇతర పంటలతో పోల్చితే మార్కెట్లో అధికంగా ధర పలుకుతుండడం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కూడా భారీగా పెంచడంతో అన్నదాతలు పత్తి సాగు వైపే అధికంగా మొగ్గు చూపారు. ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు ఉత్సాహంగా పత్తి పంటను సాగు చేశారు. పంట అంతా పచ్చగా పెరుగుతున్న తరుణంలో జూలై, ఆగస్టు నెలలో వర్షాలు ఎడతెరపి లేకుండా కురిశాయి. మరింత ఏపుగా మొక్క పెరగడానికి రైతులు యూరియా, రసాయనిక మందులు అధికంగా వాడారు. కొద్ది రోజులకు పంట అంతా ఎర్రబారిపోయింది. పూత దశలో ఉన్న మొగ్గ పిందెలోనే రాలిపోయాయి. పత్తికాయలు రాలి పురుగులు సోకుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఆదోని, ఎమ్మిగనూరు, గోనెగండ్ల కోడుమూరు, ఆలూరు, కోసిగి కౌతాళం, పెద్దకడబూరు మండలాలలో పత్తి చేలంతా ఎర్రబారిపోయాయి. రైతులు ఎర్రబారకుండా వేలకు వేలు పెట్టుబడి పెట్టి పిచికారి మందులు వాడినా ఫలితం లేదని దిగాలు చెందుతున్నారు.



రాలిన పత్తి పువ్వు కాయలు

విచ్చలవిడిగా ఎరువులు..

వర్షాలకు విచ్చలవిడిగా ఎరువులు వాడటంతో పత్తిలో దోమపోటు విపరీతంగా పెరిగింది. దోమపోటుకు మొక్క సారాన్ని పీల్చి పంట దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు.

మూడేళ్లకు ఒక్కసారి పంట మార్పిడి

కర్నూలు జిల్లాలో పత్తి పంటను రైతులు పదేళ్లుగా సాగు చేస్తున్నారు. మూడేళ్లకు ఒకసారి పంట మార్పిడి చేయాల్సి ఉన్నా రైతులు అధిక ధరలతో పత్తి పంటనే వరుసగా సాగుచేస్తున్నారు. దీంతో భూమిలో సారం తగ్గి దిగుబడి మరింత తగ్గడమే కాకుండా తెగుళ్లు, పురుగులు అధికంగా సోకే ప్రమాదం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులకు అవగాహన కల్పిస్తున్న పట్టించుకోవడం లేదు.





ఎర్రబారిన పత్తి ఆకులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఆగస్టు మూడో వారంలో కురిసిన వర్షాలకు పత్తి పంటలో ఎదుగుదల లోపించింది. పోషకాలను మొక్కలు గ్రహించుకోలేకపోవడం, నేలల్లో తేమశాతం లేకపోవడంతో ఆకులు ఎరుపు లేదా పసుపు రంగులోకి మారాయి. అక్కడక్కడ పూత, పిందెలు రాలడం గమనిస్తున్నాం. రైతులు వ్యవసాయ అధికారులు చెప్పిన విధంగా యాజమాన్య పద్దతులు పాటిస్తే ఫలితం ఉంటుంది.

● సుధాకర్, వ్యవసాయ శాఖాధికారి, ఆదోని

అధిక వర్షాలతో మొక్క దెబ్బతిని..

వర్షాధారం కింద ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుంది. అధికార వర్షాల వల్ల మొక్కలు దెబ్బతిన్నాయి. పూత కాయలు రాలిపోయాయి. పత్తి దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దిగుబడి తగ్గితే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదని రైతులు చెబుతున్నారు.

నాలుగెకరాల్లో పత్తి సాగు చేశా



నాకున్న నాలుగెకరాల్లో పత్తి పంటను సాగు చేశా. ఎకరాకు ఇప్పటికే 25 వేలకుపైగా పెట్టుబడి పెట్టాను. వర్షాలత్లో పురుగు తీవ్రత పెరిగింది. వారానికి ఒకసారి పిచికారి మందు చేస్తున్నాను. పురుగు, దోమపోటు తగ్గడం లేదు.

● రాజు, కల్లుబావి, ఆదోని మండలం

దిగుబడి తగ్గే ప్రమాదం



నాకున్న 10 ఎకరాల్లో నాలుగేళ్లుగా పత్తి సాగు చేశా. ఆగస్టు నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి చేలంతా ఎర్ర బారింది. పూత పిందెలంతా రాలిపోయాయి. మందులు చలినా పిచికారి చేసినా పంట నష్టం జరుగుతూనే ఉంది. దిగుబడులు తగ్గే ప్రమాదముంది.

● రవి, రైతు, ఆదోని మండలం

సారా నిర్మూలనే లక్ష్యం

- నూతన బార్ పాలసీని పూర్తి చేయండి
- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నవోదయం-2 ప్రక్రియలో సారా నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి సిబ్బందికి పిలుపునిచ్చారు. మంగళవారం తన చాంబర్‌లో నంద్యాల, కర్నూలు జిల్లాల సీఐలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో సారా నిర్మూలనపై చర్యలు తీసుకోవాలన్నారు. సారా మానేసిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో మొదటి విడత అనుమతులు పొందిన 37 బార్లకు వారి చేత రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ కట్టించి బార్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తులు రాకుండా మిగిలి పోయిన 9బార్లకు నోటిఫికేషన్ వచ్చినందున ఈనెల 14 లోపు దరఖాస్తులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా నిరంతరం దాడులు కొనసాగించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమంతరావు, సూపరింటెండెంట్లు ఎం.సుధీర్ బాబు, రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, వి.రాముడు, సీఐలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆదాయ వనరులు సృష్టించాలి

జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్



శిక్షణలో మాట్లాడుతున్న డీపీవో భాస్కర్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి, ఇతర పన్నులతో సొంతంగా ఆదాయలను సృష్టించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ పిలుపునిచ్చారు. ఏపీఎస్ఐఆర్‌డీ అండ్ పీఆర్ విజయవాడ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు బుధవారం డీపీఆర్‌సీ భవనంలో శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులైన పన్నులు, ఇతర మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఆదాయ వనరులు సమకూర్చుకోవడానికి ఉన్న చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. సరైన పద్ధతిలో అసైన్‌మెంట్ చేయడం వల్ల వసూళ్లను కూడా సక్రమమైన పద్ధతిలో చేయాలన్నారు. ఆదాయ వనరులు పంచాయతీల అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు ఏ.జేమ్స్ కృపవరం, పి.ప్రభాకర్, అన్వర్‌భాష, పి.జగన్నాథం, డీకే.దస్తగిరి బాషా పాల్గొన్నారు.

14 వరకు జిల్లాలో వర్షాలు



ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి ప్రభావంతో గురువారం నుంచి 14వ తేదీ వరకు జిల్లాలో ఓ మోస్తరుగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 11వ తేదీన 12 మిల్లీమీటర్ల వర్షపాతం, 12న 10 మి.మీ, 13న 18మి.మీ, 14వ తేదీన 13 మి.మీ మేర వర్షపాతం నమోదుకు అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే పశ్చిమం నుంచి వాయువ్యం దిశగా గంటకు 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. వర్షాపాతాన్ని దృష్టిలో ఉంచుకొని పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా సమచారం కోసం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

పన్నుల వసూళ్లపై చిత్తశుద్ధి లేదా?

- ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు ఏమి చేస్తున్నారు
- నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొండిబకాయి పన్నులను వసూలు చేయడంలో కొందరు అధికారులు ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిలో మార్పు రాకపోతే సస్పెండ్ చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. బుధవారం నగరంలోని ఎస్‌బీఐ కాలనీలో ఆస్తి, కొళాయి పన్నుల వసూళ్లపై అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో రూ.100 కోట్ల పన్ను బకాయిలు, మున్సిపల్ దుకాణాల అద్దెలు, పన్ను మదింపు స్థిరీకరణ పన్నులు ఎప్పుడు వసూలు చేస్తారని ప్రశ్నించారు. నగర పాలకలో ఏమి జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఏ వార్డు సచివాలయ పరిధిలో ఎంత బకాయిలు ఉన్నాయో కూడా తెలియదా? అని అడ్మిన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు నీటి పన్ను వసూలపై ఇంజనీరింగ్ అధికారులకు అవగాహన ఉందా? అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కొళాయి కనెక్షన్లకు మీటర్లను ఎందుకు కనెక్ట్ చేయలేదని, అసలు ట్యాప్ ఇన్స్‌పెక్టర్లు ఏమి చేస్తున్నారని ఇంజనీరిగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో ఉంటూ మొండి బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు. పనితీరు బాగా లేని కార్యదర్శులకు మెమోలు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉన్న ఉద్యోగులకు ఫైనాన్షియల్ లాస్ కింద వారి ఇంక్రిమెంట్లు కట్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో తాగునీటి కొళాయి పన్నులను 95 శాతం వసూలు చేసిన 115వ సచివాలయ అమ్యూనిటీ కార్యదర్శి బి.ఉదయ్ కుమార్‌ను కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌వోలు జునైద్, వాజిద్, స్వర్ణలత పాల్గొన్నారు.

బాల భీముడు

● ఐదు కిలోల బరువుతో శిశువు జననం



దాదాపు 5 కిలోల బరువుతో జన్మించిన శిశువు

ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం ఓ మహిళ బాల భీముడికి జన్మనిచ్చింది. బాలుడి బరువు 5కిలోలు ఉండటంతో వైద్యులు, స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన ఖాజా హుస్సేన్ భార్య జుబేదా మూడో కాన్పుకోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆసుపత్రి వైద్యులు సుజిత, శైలజ, ఫాతిమాల పర్యవేక్షణలో ఆమె మగబిడ్డను జన్మనిచ్చింది. సాధారణ కాన్పు కావటం, శిశువు దాదాపు 5 కిలోల(4.909) బరువుతో జన్మించాడు. తల్లీబిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

- ఎమ్మిగనూరు ఆంధ్రజ్యోతి

బన్ని ఉత్సవాలకు ముహూర్తం ఖరారు



దేవరగట్టులో కొలువైన మాళ మల్లేశ్వర స్వామి

హొళగుంద, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 27 నుంచి నవంబరు 6వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు బుధవారం వెల్లడించారు. సెప్టెంబరు 27న కంకణధారణ, అక్టోబరు 2న కల్యాణోత్సవం, అదేరోజు అర్ధరాత్రి బన్ని ఉత్సవాలు, 3న తెల్లవారు జామున దైవకార్ణికం, 4న స్వామివారి రథోత్సవం, 5న గోరవయ్యల ఇనుప సంకెళ్ల తెంపుట, 6న స్వామి వారు నెరణికి చేరుకోవడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

పోటెత్తిన ఉల్లి

- కర్నూలు యార్డుకు 14,542 క్వింటాళ్లు
- వ్యాపారుల ధర క్వింటానికి రూ.507లు మాత్రమే



కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి నిల్వలు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు బుధవారం ఉల్లి పోటెత్తింది. 14,542 క్వింటాళ్లను ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి రైతులు అమ్మకానికి తెచ్చారు. వ్యాపారులు మాత్రం క్వింటం ఉల్లికి కనీస ధర రూ.201 నుంచి రూ.507లు మాత్రమే చెల్లిస్తున్నారు. కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి, మార్క్‌ఫెడ్ డీఎం రాజు వ్యాపారులు రైతులకు ఇచ్చిన ధర పోగా మిగిలిన ధరను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కడప నుంచి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజనల్ మేనేజర్ నాగరాజు కర్నూలు చేరుకుని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిని తమ శాఖ పరిధిలోని గోదాముల్లో నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టారు. రైతులు తెచ్చిన ఉల్లిని త్వరగా కొనుగోలు చేయించడంతో పాటు ఆ ఉల్లిని బయటి ప్రాంతాలకు తరలించేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేశారు. వ్యాపారుల అమ్మకాలపై నిఘా పెట్టేందుకు కలెక్టర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయకుంటే ప్రభుత్వానికి నష్టం వాటిల్లే అవకాశముంది.

రాక్‌గార్డెన్‌ను మరింత అభివృద్ధి చేస్తాం

● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



రాతివనాలు పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ఓర్వకల్లు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధంగా ఏర్పడిన రాక్ గార్డెన్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అనంతపురంలో జరుగుతున్న సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమానికి వెళ్లిన ఆయన ఆ కార్యక్రమంలో పాల్గొనకుండా వెనుదిరిగారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారి సహాయార్థం మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మానిటరింగ్ కోసం విజయవాడ కంట్రోల్ రూమ్‌కు ఆయన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బయల్దేరారు. అనంతపురం నుంచి విజయవాడకు వెళ్తూ మార్గమధ్యలో కర్నూలుకు చేరుకున్నారు. ఆయన వెళ్లే ఫ్లైట్‌కు సమయం ఉండటంతో సమీపంలోని ఓర్వకల్లు రాక్ గార్డెన్‌ను సందర్శించారు. హరిత రిసార్ట్స్ హరిత రెస్టారెంట్‌ను పరిశీలించారు. అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. సహజసిద్ధంగా కొండల మధ్య ఉన్న రాతివనం, చెరువు, లక్షల ఏళ్ల క్రితం ఏర్పడిన వివిధ ఆకృతులతో కూడిన రాళ్లు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయన్నారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుతో స్థానిక పర్యాటక ప్రదేశాలకు అనుసంధానం పెరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర సహకారంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కానుందని తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

మెప్మా పీడీగా శ్రీనివాసులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మెప్మా పీడీగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నగర పాలక సంస్థ పరిధిలో టీపీఆర్వోగా పని చేస్తున్న ఆయన్ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పీడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముందుగా ఆయన కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ మెప్మా పరిధిలోకి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

నేపాల్ నుంచి సురక్షితంగా...
వివరాలు 7లో..

ఉరిమే ఉత్సాహం.. సభలో ఉల్లాసం.. స్త్రీ శక్తి..!



సూపర్ హిట్

చంద్రన్న ప్రభుత్వానికి జై కొట్టిన జనం



కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



సభలో కర్నూలు జిల్లా నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. రైతన్నకు శాపం

- పొలాల్లోకి మళ్లిన నీళ్లు ● దెబ్బతిన్న పంటలు



పొలంలో నీళ్లు చూపుతున్న లద్దగిరి సర్పంచ్ హనుమంతు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతుకు శాపంగా మారింది. రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పొలంలో నీళ్లు నిలిచాయని రైతు, లద్దగిరి సర్పంచ్ పట్టి హనుమంతు వాపోయాడు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 786లో సుమారు తనకు నాలుగెకరాల పొలం ఉందన్నారు. ఎగువన పొలాల నుంచి వచ్చే నీరు ముందుకు వెళ్లడానికి వీలుగా తన పొలం వెంట కాలువ తవ్వించుకున్నట్లు తెలిపారు. అయితే కోడుమూరు-వెల్దుర్తి రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఇటీవల కాలువపై మట్టి వేయడంతో ఎగువ నుంచి వచ్చే నీరు పొలంలోకి మళ్లిందన్నారు. దీంతో పత్తి, కంది పంటలతో పాటు మామిడి, కొబ్బరి మొక్కలు దెబ్బ తింటున్నాయని ఆవేదన చెందారు. ఐదు రోజుల నుంచి మట్టిని తొలగించాలని కోరుతున్నా సిబ్బంది పెడచెవిన పెడుతున్నారని వాపోయాడు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



వెంకటగిరి వద్ద రోడ్డును అనుకుని మట్టికుప్ప

వెంకటగిరి వద్ద మట్టికుప్ప: వెంకటగిరి గ్రామం వద్ద రోడ్డు నిర్మాణ పనులకు వినియోగించే మట్టికుప్పను రోడ్డును అనుకుని పోశారు. రాత్రి సమయాల్లో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. భారీ వాహనాలు ఎదురైతే మాత్రం ఏదో ఒకటి ఆపుకోవాల్సి ఉంటుంది. నాలుగైదు రోజులుగా మట్టికుప్ప అలాగే ఉందని స్థానికులు తెలపడం కొసమెరుపు.

విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి

- మాజీ జేడీ లక్ష్మీనారాయణ



కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలని మాజీ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం రవీంద్ర మహిళా ఇంజనీరింగ్, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇండెక్షన్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంజనీర్లుగా కాకుండా ఇంజనీరింగ్ నాయకులుగా ఎదగాలన్నారు. యువత సామాజిక మాధ్యమాల పట్ల అతిగా ఆకర్షితులై తమ జీవితాన్ని తిరో గమనం వైపు పయనిస్తున్నారన్నారు. పద్మశ్రీ మల్లేషన్, మాంజీలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తమ గురువు, పూర్వ భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను గుర్తుచేశారు. మీరు చదివే కళాశాలలకు మీరే ముఖ్యఅతిథిగా రావడం, మీ సంతకం ఒక ఆటోగ్రాఫ్‌లాగా, మీ తల్లిదండ్రులు మీగురించి గర్వపడేలా చేయాలన్న మాటలు గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ కేతు శ్రీనివాసమూర్తి, డా.సి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపా ల్ డా.ఉషశ్రీ, డీన్ (అడ్మిన్) డాక్టర్ ఎం.గిరిధరకుమార్, డీన్(స్టూడెంట్ అసోసియేట్ ప్రొఫెసర్) జి.శశికుమార్, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

కృషీవలుడు చంద్ర



ఒంటిచేత్తో దెంత లాగుతున్న రైతు చంద్ర

దెంత లాగుతున్న రైతు పేరు చాకలి చంద్ర. ఎర్రదొడ్డి స్వగ్రామం. ఇతడికి నాలుగెకరాల పొలం ఉంది. మొదట్లో చంద్ర సెంట్రింగ్ పని చేసేవాడు. కొన్నేళ్ల క్రితం ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆ ప్రమాదంలో దెబ్బతిన్న కుడిచేతిని తొలగించారు. సెంట్రింగ్ పనికి దూరమయ్యాడు. ఒక్కచేతితోనే వ్యవసాయ పనులు చేసుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. చంద్రకు తల్లితో పాటు భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. నలుగురు కూతుళ్లలో ఇద్దరికి వివాహం జరిపించాడు. బుధవారం కొడుకు రవితో కలిసి బెండ పంటలో దెంత లాగాడు. ఎద్దుల బాడుగకు రూ.2వేలు ఖర్చు అవుతుందని, పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవడానికి కష్టమైనా భరించినట్లు తెలిపాడు.

- కోడుమూరు రూరల్ ఆంధ్రజ్యోతి

అభివృద్ధిని ఓర్చుకోలేకపోతున్న జగన్

ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



మాట్లాడుతున్న గుమ్మడి గోపాలకృష్ణ

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాది కాలంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఓర్చుకోలేకపోతున్నారని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేయడాన్ని సహించలేని జగన్ సరికొత్త నాటకాలకు తెరతీస్తున్నారన్నారు. బుధవారం ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ కర్నూలుకు చేరుకుని విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ సాధించాయని, అందుకే అనంతపురం జిల్లాలో జరిగిన బహిరంగ సభకు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చాయన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నాటక రంగం పూర్తిగా నిర్వీర్యమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళాకారులు, కవులు, రచయితలకు మళ్లీ జీవం పోస్తున్నారన్నారు. ధనార్జనే ధ్యేయంగా సాగిన ఆయన పాలన అంతా అవినీతిమయమైందని ఆరోపించారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో కళాకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలను తీసుకొస్తున్నట్లు తెలిపారు. కళలు, నాటక రంగం అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఎదుట పలు ప్రతిపాదనలు ఉంచినట్లు తెలిపారు. కళాకారుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులు, వారి ప్రదర్శనలు, సంక్షేమానికి కోసం టీటీడీ, శ్రీశైలం, ఇంద్రకీలాద్రి వంటి దేవస్థానాల నుంచి ఆర్థికపరమైన సహాయాన్ని కోరుతామన్నారు. మైసూరు దసరా ఉత్సవాలను మించి ఉండేలా 'విజయవాడ ఉత్సవ్' నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు విజయవాడ ఉత్సవ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గుమ్మడి గోపాలకృష్ణ వెల్లడించారు. ఈ సమావేశంలో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, నాటక దర్శకులు పత్తి ఓబులయ్య ఉన్నారు.

22 నుంచి దసరా సెలవులివ్వాలి : ఆప్టా

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు దసరా సెలవులను ఈ నెల 22వ తేదీ నుంచి ఇవ్వాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షులు ఏబీఎస్ గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రకాష్‌రావు మంత్రి నారా లోకేశ్‌కు పాఠశాలల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 24వ తేదీ నుంచి దసరా సెలవులు ఇచ్చారని, దాన్ని మార్చి సెప్టెంబరు 22 నుంచి (మహలయ అమా వాస్య) అన్ని పాఠశాలలకు సెలవులను ప్రకటించాలని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా మహాలయ అమావాస్య నుంచి పాఠశాలలకు సెలవు లు ఇచ్చారని సూచించారు. హిందూ మనోభావాలను గౌరవించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ కోసం ఇంటర్వ్యూలు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీదేవి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా హేవీ మోటారు వాహనం ఉచిత డ్రైవింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీదేవి ఆధ్వర్యంలో కర్నూలు డిపో-1 బీఎం సుధారాణి ఆధ్వర్యంలో జరిగాయి. కర్నూలు జిల్లాలో 18మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఇందులో 10మందిని ఎంపిక చేయాల్సి ఉంది. అలాగే నంద్యాల జిల్లాలో 14 దరఖాస్తులు వచ్చా యి. 12 మంది హాజరయ్యారు. ఇందులో పది మందిని ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను ఎస్సీ కార్పొరేషన్ ఏవో విజయలక్ష్మి, ఆర్టీసీ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు, నంద్యాల జిల్లా అధికారులు పరిశీలించారు.

కర్నూలు ఖ్యాతిని పెంచండి

మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో సత్కారం అందుకున్న టీజీవీ కళాక్షేత్రం కళాకారులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచిగా ఉన్న కర్నూలు జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కళాకారులకు పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని సత్యసాయి సేవా సమితి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్, అమరావతి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు 'జగదేక సుందరి సామా' చారిత్రక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో ప్రథమ బహుమతితో పాటు నాలుగు వ్యక్తిగత అవార్డులు రావడంపై టీజీ వెంకటేశ్ బుధవారం కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కళాకారులను ప్రోత్స హించే విధంగా నాటక పోటీలు ఏర్పాటుచేసి కళాకారులను ప్రోత్సహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోం దని అన్నారు. ఈ బహుమతులు సాధించడంతో పాటూ భవిష్యత్తులో టీజీవీ కళాక్షేత్రానికి మరింత కీర్తిప్రతిష్ఠలు సాధించే దిశగా కళాకారులు ముందుకు పోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పి.రాజారత్నం, కేవీ రమణ, వాల్మీకి రాముడు, గాండ్ల లక్ష్మన్న, జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, కె.బాలవెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతరావు, గురుమూర్తి, బలరాం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీజీవీ కళాక్షేత్రం కళాకారుల కృషి అభినందనీయమని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. జగదేక సుందరి సామా చారిత్రక పద్య నాటకం కళాకారులను ఆయన బుధవారం అభినందించారు.

ట్రాఫికర్

- కేసీ కెనాల్ వద్ద నిమజ్జనానికి తొలగించిన డివైడర్లు
- తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో తలెత్తిన సమస్య



వినాయకఘాట్ వద్ద అస్తవ్యస్తంగా వస్తున్న వాహనాలు

కల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని వినాయక ఘాట్ కేసీ కెనాల్ సమీపంలో ట్రాఫిక్‌జామ్‌తో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా ఈప్రాంతంలో నిత్యం ట్రాఫిక్‌జామ్ వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటమే కాకుండా చిన్నపాటి ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. గాయత్రి ఎస్టేట్ నుంచి వినాయకఘాట్ దాటేందుకు కనీసం పది నిమిషాలు సమయం పడుతోంది. కలెక్టరేట్ నుంచి గాయత్రి ఎస్టేట్, దేవానగర్‌కు వెళ్లే వాహనాలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 4న వినాయక నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు వినాయకఘాట్ సమీపంలోని సిమెంట్ బారికేడ్లు(డివైడర్స్) తొలగించారు. నిమజ్జనంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. తొలగించిన డివైడర్లను యథాస్థానంలో ఏర్పాటు చేయకపోవడంతో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఇష్టానుసారంగా ప్రయాణిస్తున్నాయి. దీంతో రోడ్డు దాటేందుకు మహిళలు, వృద్ధులు చిన్నారులకు తిప్పలు తప్పడం లేదు. నిత్యం ఇదే రహదారిపై ప్రయాణిస్తున్న పోలీసులు చర్యలు తీసుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మెరుగైన సేవలు అందించాలి

- విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం ఉమాపతి



డయల్ యువర్ ఎస్ఈలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎం.ఉమాపతి

కల్లూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆశాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో డయల్ యువర్ ఎస్ఈ నిర్వహించిన ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 14 మంది ప్రజలు పలు సమస్యలపై ఎస్ఈకి ఫోన్‌లో సమస్యలు విన్నవించారు. ఈసందర్భంగా ఉమాపతి మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమైతే తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా విద్యుత్ సరఫరా అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారు సూచించే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

నేడు కర్నూలులో జిల్లా జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో కర్నూలు జిల్లా స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో అండర్-14, 17బాల, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేస్తున్నట్లు నంద్యాల జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి బి.విశ్వనాథ్, జి.ఆశాజ్యోతిలు తెలిపారు. అండర్-14, 17 బాల, బాలికల విభాగాల్లో ఫుట్‌బాల్, ఉషూ, కరాష్ క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్-17విభాగంలో ఉషూ జిల్లా బాల, బాలికల జట్లను ఎంపిక చేస్తామన్నారు.

డిప్యూటీ డైరెక్టర్‌గా నాగరత్నమ్మ



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.నాగరత్నమ్మ కడప రీజనల్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి ఏడీలకు సంబంధించి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో కేఎంసీ ఏడీగా పని చేస్తున్న ఎం.నాగరత్నమ్మను డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ కడప కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో కర్నూలు మెడికల్ కాలేజీలో పరిపాలన విభాగంలో ఏవో పోస్టుతో పాటు ఏడీ పోస్టు ఖాళీగా ఏర్పడింది. డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన ఎం.నాగరత్నమ్మను కేఎంసీ ప్రిన్సిపాల్ వై.చిట్టినరసమ్మ, ఆఫీస్ సూపరింటెండెంట్ హరిశంకర్ తదితరులు అభినందించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శ్రీనివాసులు(ఫైల్)

తుగ్గలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండంలోని చిన్న జొన్నగిరి గ్రామానికి చెందిన రైతు చెట్నేపల్లి శ్రీనివాసులు(65) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జొన్నగిరి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన మేరకు.. మూడెకరాల సొంత పొలంతో పాటు నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పూతగడ్డ, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, కంది, సజ్జ పంటలను సాగు చేశారు. అయితే ఏటా నష్టాలు వచ్చి దాదాపు రూ.14లక్షల అప్పులయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక మదనప డుతూ ఉండేవాడు. మంగళశారం సాయంత్రం విషపు గుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుత్తిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం అనంతపురం వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య మల్లేశ్వరమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. టీడీపీ నాయకులు మిద్దె రవికుమార్, బాలన్న, నాగరాజు, బలరాముడు, సంగాల కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని..

రైలు కిందపడి విద్యార్థి బలవన్మరణం


జగదీశ్వరరెడ్డి(ఫైల్)

నంద్యాల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించడంతో బీ.టెక్ చదివే ఓ విద్యార్థి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నంద్యాల పట్టణంలో చోటుచేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ కుమారి తెలిపారు. వివరాలు.. నందికొట్కూరు మండలం తర్తూరు గ్రామానికి రమేశ్‌రెడ్డి, రాణి దంపతుల కుమారుడు జగదీశ్వరరెడ్డి(17). తిరుపతిలోని విద్యానికేతన్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజుల క్రితం కళాశాలలో ఫీజు కట్టమని రూ.2.5లక్షలు తల్లిదండ్రులు ఇచ్చారు. అయితే జగదీశ్వరరెడ్డి ఆ డబ్బులు కట్టకుండా వాడుకున్నాడు. కళాశాల నుంచి ఫీజు కట్టాలని ఫోన్ వచ్చింది. దీంతో తల్లిదండ్రులు అతడిని మందలించారు. మనస్థాపం చెందిన విద్యార్థి మంగళవారం రాత్రి నంద్యాల రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఫ్లాట్‌ఫాం సమీపంలోనే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన వీరారెడ్డి(70) సోమవారం ఎమ్మిగనూరు నుంచి మల్కాపురం గ్రామానికి బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. ఆదోని రోడ్డులోని శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ డిగ్రీ కళాశాల సమీపానికి వెళ్లగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో వీరారెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

- మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న కర్ణాటక పోలీసులు


అర్జున్ (ఫైల్)

హొళగుంద, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమ్మాతాగేరి క్యాంప్ వద్ద ఎల్లెల్సీ కాల్వలో రెండు రోజులు క్రితం గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్ర బళ్లారి జిల్లా కంపి కొట్టాల నివాసి అర్జున్(21). రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయినట్లు మృతుడు తండ్రి సుంకప్ప కురుగోడు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. బళ్లారి పరిధిలోని సోమలాపురం గ్రామ సమీపంలో మంగళవారం ఎల్‌ఎల్‌సీ కాలువ గట్టుపై మృతుడికి సంబంధించిన బైక్‌ను కురుగోడు పోలీసులు కనుగొన్నారు. కాలువ వెంట పరిశీలించుకుంటూ వస్తుండగా బుధవారం మధ్యాహ్నం ఆంధ్రా సరిహద్దులోని సమ్మాతాగేరి క్యాంప్ వద్ద మృతదేహాన్ని కనుగొని, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని అర్జున్‌గా గుర్తించడంతో హొళగుంద ఎస్‌ఐ మిస్సింగ్ కేసు ఎఫ్‌ఐఆర్ వివరాల సమాచారమిచ్చి, మృతదేహాన్ని బళ్లారిలోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వేధింపుల కేసులు నమోదు

మంత్రాలయం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రాంతాలకు చెందిన భర్తలపై వేధింపుల కేసులు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్స్ లక్ష్మీనా రాయణ, రమణ తెలిపారు. వివరాలు.. చెట్నహల్లి గ్రామానికి చెందిన ఏలిశమ్మను ఎమ్మిగనూరు చెందిన మారెప్ప, లక్ష్మి కుమారుడు సుమలజాన్‌కు ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించారు. భర్త సుమలజాన్ రోజూ తాగి వచ్చి ఏలిశమ్మను హింసించడంతో పాటు అనుమానంతో వేధించేవాడు. దీనికి తోడు అత్త లక్ష్మి సైతం చిత్రహింసలు పెట్టేది. వారి బారి నుంచి తప్పించుకుని ఆమె చెట్నహల్లి గ్రామానికి వచ్చింది. బుధవారం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భర్త సుమలజాన్, అత్త లక్ష్మిలపై కేసు నమోదు చేశారు. అలాగే మంత్రాలయం రాఘవేంద్రపురం కాలనీకి చెందిన బెస్త గాయత్రీని కర్ణాటకలోని రాయచూరు తాలుకా ఈరాపురం గ్రామానికి చెందిన వీరేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి సమయంలో రూ.50వేల నగదు, తులం బంగా రు కట్నంగా ఇచ్చారు. భర్త వీరేష్ రోజూ తాగి వచ్చి చిత్రహింసలు పెడుతూ అనుమానంతో వేధించేవాడు. బాధితురాలు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసులో నిందితులు అరెస్టు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ అస్రర్ బాషా తెలిపారు. వివరాలు.. నంద్యాల పట్టణం నడిగడ్డకు చెందిన హుస్సేని, సుభాన్ దేవనగర్‌కు చెందిన అల్తాఫ్ ముగ్గురు కలిసి ఫరూక్‌కు ఆటోను పండ్లతో సహా అద్దెకు ఇచ్చారు. వాటిని అమ్ముకొని రావాల్సి చెప్పారు. అయితే ఫరూక్ ఇవ్వకుండా వెళ్లాడు. అతడిని టెక్కె మార్కెట్ యార్డులోని గదిలో బంధించి దాడిచేశారు. దీనికి సంబంధించి వీడియో బయటకు వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీన్ని సుమోటాగా కేసు నమోదు చేసి కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఛేదించి నిందితులను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించారు.

భార్యను చంపిన భర్తకు రిమాండు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో భార్యను చంపిన హత్య కేసులో భర్తకు బుధవారం రిమాండ్ విధించినట్లు టూ టౌన్ సీఐ అస్రర్ బాషా తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో కాలనీకి చెందిన శిరీషా (45) అనే మహిళను భర్త సోమనాధశర్మ అనే వ్యక్తి అనుమానంతో కత్తితో గొంతు కోసి చంపాడు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

కీలక మలుపు

- అటవీ శాఖ అవినీతి కేసులో పురోగతి
- కోర్టులో లొంగిపోయిన ప్రధాన నిందితుడు చాంద్‌బాషా
- రిమాండ్‌కు ఆదేశించిన న్యాయాధికారి


చాంద్‌బాషా(ఫైల్)

ఆత్మకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోనే సంచలనంగా మారిన అటవీశాఖ సొమ్ము కాజేసిన కేసు కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రిటైర్డ్ అటవీ శాఖ ఉద్యోగి చాంద్ బాషా బుధవారం ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టులో లొంగి పోగా మెజిస్ట్రేట్ రాహుల్ అంబేద్కర్ ఆయనకు 14రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో స్థానిక పోలీసులు ఆయన్ను నందికొట్కూరు సబ్ జైలుకు తరలించారు. కాగా ఆత్మకూరు అటవీ డివిజన్ కార్యాలయంలో సుమారు 15ఏళ్ల పాటు ఏవోగా పనిచేసి గత ఏడాది జూలైలో పదవీవిరమణ పొందిన ఏఎస్.చాంద్‌బాషా పని చేసిన సమయంలో అటవీశాఖకు చెందిన సొమ్మును తన సొంత అవసరాలకు దారిమళ్లించాడు. తొలుత రూ.19,25,993 విలువ గల రెండు చెక్కులను ఎఫ్‌డీపీటీ నంద్యాల చెందిన అకౌంట్‌కు పంపించాల్సి ఉండగా ఆ సొమ్మును తన బంధువుల పేర్లతో డ్రా చేసుకున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ ఏడాది ఏప్రిల్ 21న చాంద్ బాషాపై ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేయగా జూలై 22వ తేది నాటికి రూ.4,37,65,501 అటవీశాఖ సొమ్మును స్వాహా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆతర్వాత కూడా విజిలెన్స్ కమిటీ విచారణ చేపట్టగా మరిన్ని అవకతవకలు వెలుగుచూశాయి. ప్రధాన నిందితుడైన చాంద్‌బాషా అటవీశాఖ చెక్కులను తన కుటుంబీకులతో పాటు నేతాజీనగర్‌లోని మహేశ్వర ప్రింటర్స్ యజమాని వెంకట శివయ్య ద్వారా డ్రా చేయించి స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలోనే ఈ కేసులో ఏడుగురిని నిందితులుగా గుర్తించి అందులో ఐదుగురిని ఇప్పటికే అరెస్టు చేశారు.

హైకోర్టు ఉత్తర్వులతో..

హైకోర్టు ఉత్తర్వులతోనే రిటైర్డు అటవీ ఉద్యోగి చాంద్‌బాషా ఆత్మకూరు కోర్టులో లొంగిపోయారు. వాస్తవానికి అటవీ శాఖ సొమ్ము వ్యవహారంలో తొలుత రూ.19.25లక్షలు మాత్రమే అవినీతి జరిగినట్లు అటవీశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన చాంద్ బాషా ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశాడు. అలాగే తాను వాడుకున్న రూ.19.25లక్షలను తిరిగి చెల్లించానని, వయస్సు రీత్యా పోలీసులు తనను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని చాంద్‌బాషా హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో చాంద్‌బాషాను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ తర్వాత చాంద్ బాషా అక్రమాలు బట్టబయలు కావడంతో ఏకంగా రూ.4.37కోట్లు అవకతవకలు జరిగినట్లు తేలింది. దీంతో చాంద్ బాషా స్వాహా చేసింది రూ.19.25లక్షలు కాదని.. రూ.4.37కోట్లు అని తేలింది. ఇది పెద్ద కుట్ర అని పోలీసులు హైకోర్టులో కౌంటర్లు దాఖలు చేస్తూ వచ్చారు. అయితే హైకోర్టును తప్పుదోవ పట్టించేలా చాంద్‌బాషా వ్యవహరించడంతో ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చి వారంలోగా ఆత్మకూరు కోర్టు (మదర్ కోర్టు)లో లొంగిపోవాలని హైకోర్టు వారు ఉత్తర్వులు జారీ చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఐదు నెలల తర్వాత చాంద్‌బాషా కోర్టులో లొంగిపోవాల్సి వచ్చింది.

స్థలం కోసం తహసీల్దార్‌పై దౌర్జన్యం


కోర్టు ఆర్డర్ చూపుతున్న తహసీల్దార్


వాదిస్తున్న ఆర్మీ ఉద్యోగి కుమార్తె పద్మ

బేతంచెర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల క్రితం స్థలాన్ని అమ్ముకొని వేరే ప్రాంతానికి వలస వెళ్లి ఇప్పుడు వచ్చి తమ స్థలం తమకే అప్పగించాలంటూ బుధవారం తహసీల్దార్ నాగమణిపై దౌర్జన్యం చేశారు. ఈ ఘటన పట్టణంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు.. రిటైర్డు ఆర్మీ ఉద్యోగి సానే శ్రీనివాసులు, ఆయన కుమార్తె పద్మ, కుటుంబ సభ్యులు గతంలో బేతంచెర్లలో నివాసం ఉండేవారు. 50 సంవత్సరాల క్రితం తమకున్న స్థలాన్ని అమ్ముకుని హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఇప్పుడు వచ్చి తమ స్థలాన్ని తమకు సర్వే చేయించి అప్పగించాలంటూ తహసీల్దార్‌పై దౌర్జన్యం చేస్తూ తమ స్థలం అప్పగించేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లమని అన్నారు. అంతలో పోలీసులు వచ్చి వారి దౌర్జన్యాన్ని నివారించే ప్రయత్నం చేశారు. పద్మ మాట్లాడుతూ పోలీసులు తహసీల్దార్‌కు దాసోహం చేస్తున్నారే తప్ప తమకు న్యాయం చేయలేదని, తమకు న్యాయం జరిగేంత వరకు ఇక్కడే ఉంటామని అన్నారు. సర్వేయర్ స్థలం సర్వే చేయించకుండా తహసీల్దార్ నాగమణి అడ్డుపడ్డారని, ఆమెపై దాడికి పాల్పడటంతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని కార్యాలయం నుంచి బయటికి తీసుకువచ్చారు.

వివరణ: ఈ విషయమై తహసీల్దార్ నాగమణిని వివరణ కోరగా తమకు ఆర్మీ ఉద్యోగి శ్రీనివాసులు స్థలం విషయంలో ఎలాంటి జోక్యం లేదని, గతంలోనే వారి స్థలాన్ని ఇతరులకు విక్రయించారని తెలిపారు. అయితే ప్రస్తుతం తన స్థలం తనకు కావాలని సర్వే చేయించి ఇవ్వాలని కుటుంబ సభ్యులంతా తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆమె తెలిపారు. స్థలానికి సంబంధించిన వ్యక్తి కోర్టు నుంచి స్టే ఆర్డర్ తీసుకుని వచ్చారని, కోర్టు అనుమతుల ప్రకారమే తాను ఫాలో అవుతున్నామని ఆమె తెలిపారు.

ఎమ్మెల్యే విరుపాక్షి దాతృత్వం

- చిగిలి బాధితులకు కుటుంబానికి రూ.50 వేల చొప్పున సాయం


బాధిత కుంటుంబాలకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆస్పరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిలి గ్రామంలో ఆగస్టు 20న చిన్నారులను కోల్పోయిన బాధిత తల్లిదండ్రులకు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆర్థిక సాయం చేశారు. బుధవారం గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుం బాలను ఆదుకోవడం వైసీపీకే చెందుతుందన్నారు. బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. బాధిత కుంటుబాలను ఆదుకోవాలని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, గోవర్ధన్, రామాంజనేయులు, మహానంది, సర్పంచులు రాధాకృష్ణ, హరికృష్ణ, ప్రకాష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు


బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మహేశ్వర ప్రసాద్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతుందని, ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని రాష్ట్రీయ బాల ఆరోగ్య సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా మానసిక ఆరోగ్య సమస్యల బ్యానర్‌ను మానసిక వైద్యులు డా.చైతన్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ ఏదైనా ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన అత్యంత ప్రమాదకరమన్నారు. దీని నుంచి బయట పడాలంటే మానసిక వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో మానసిక వైద్యులు డా.చైతన్య అవగాహన కల్పించారు. ఆత్మహత్యల నివారణకు టెలిమానస్ టోల్‌ఫ్రీ నెంబర్.14416ను సంప్రదించి నిపుణుల ద్వారా ఉపశమనం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డా.ఆర్.పద్మావతి, డెమో శ్రీనివాసులశెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి
- బాలికల పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

వెల్దుర్తి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఫుడ్ కమిషన సభ్యురాలు గంజిమల దేవి సూచించారు. బుధవారం జ్యోతిబా పూలే పాఠశాలను అనిఖీ చేశారు. స్టోర్ రూం, స్టాక్ పాయింట్లను పరిశీలించి, విద్యార్థినులతో మాట్లాడారు. ఉదయం టిఫిన్, రోజూ అరటి పండు ఇస్తున్నారా అని అడుగగా.. ఇవ్వడం లేదని విద్యార్థినులు తెలిపారు. దీంతో ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తంచేసి, మెనూ పాటించాలని సూచించారు. అంబేడ్కర్ గురుకులం, పట్టణంలోని బాలికల పాఠశాలను పరిశీలించారు. సరైన సమాధానం ఇవ్వని బాలికల పాఠశాల హెచ్‌ఎంకు నోటీసులు జారీ చేయాలని ఇన్‌చార్జి ఎంఈవోను ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించారు. తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, డీటీ గురుస్వామి రెడ్డి ఉన్నారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న గంజిమల దేవి

అనస్థీషియా టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేయాలి


డీఎం డాక్టర్ రఘునందన్‌ను అభినందిస్తున్న టెక్నీషియన్లు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న అనస్థీషియా టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేయాలని ఏపీ అనస్థీషియా టెక్నీషియన్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డా.జి.రఘునందన్‌ను కోరింది. విజయవాడలో బుధవారం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.దినేష్ ఆధ్వర్యంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌ను కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో తమకు ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్‌లు ఇవ్వడ లేదని రాష్ట్ర కార్యదర్శి దినేష్, డీఎంఈ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జీతభత్యంలో వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. దీనిపై స్పందించిన డీఎంఈ తక్షణమే జూమ్ మీటింగులో సంబంధిత అధికారులతో మాట్లాడి విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అనస్థీషియా టెక్నీషియన్ల ఖాళబూ పోస్టులను భర్తీ చేస్తానని డీఎంఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వినోద్, వైస్ సెక్రటరీ సురేష్, అమర్ పాల్గొన్నారు.

నేపాల్ నుంచి సురక్షితంగా...

- దాడులతో ఇబ్బందులు పడ్డ ఆదోని వాసులు
- మంత్రి నారా లోకేశ్ చొరవతో భారత్ చేరుకున్న వైనం


భారతదేశానికి చేరుకున్న పెండేకల్లు బసవరాజు, అనిత

ఆదోని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విహార యాత్ర కోసం నేపాల్ వెళ్లగా.. అక్కడ జరుగుతున్న దాడుల్లో ఆదోని వాసులు చిక్కున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన 22 మంది దాకా నేపాల్‌లో ఉన్నారు. వారిలో పట్టణంలోని ఎస్కేడీ కాలనీకి చెందిన భార్యాభర్తలు పెండేకల్లు బసవరాజు, అనితలున్నారు. వీరిద్దరూ విహారయాత్ర కోసం నేపాల్ వెళ్లారు. వృత్తిరీత్యా పెండేకల్లు బసవరాజు గోల్డ్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరితోపాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన పది మంది వీరి బంధువులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. వీరందరినీ రక్షించేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపి అక్కడ ఉన్న వారిని భారతదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. ఎస్కేడీ కాలనీకి చెందిన పెండేకల్లు బసవరాజు, అనిత దంపతులు భారతదేశానికి బుధవారం రాత్రి 10గంటల సమయంలో సురక్షితంగా చేరుకున్నారు. మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక ప్రయత్నాలతో వారిని సురక్షితంగా భారత్‌కు రప్పించారు. ఈవిషయం నారా లోకేశ్ కార్యాలయం నుంచి ఆదోని తెలుగు యువత నాయకులు మారుతినాయుడికి సమాచారం అందించారు. వెంటనే ఆయన వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ ఫోన్‌లో వారితో మాట్లాడారు. అక్కడ చిక్కుకున్న మొత్తం 32 మంది వివిధ ప్రాంతాల వారు కూడా మంత్రి లోకేశ్ సాయంతో భారతదేశ సరిహద్దుకు చేరుకున్నారు. భారత్‌కు చేరుకున్న యాత్రికులు మంత్రి లోకేశ్, మారుతినాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

జమ్మలమడుగులో ఘోరం

- గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ
- 20 గొర్రెలతోపాటు ఇద్దరు కాపరులు మృతి
- మృతులు నంద్యాల జిల్లా రుద్రవరం వాసులు



మృతి చెందిన గొర్రెల కాపరులు

జమ్మలమడుగు/రుద్రవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న వారి పాలిట ఓ లారీ మృత్యుశకంగా మారింది. బుధవారం తెల్లవారు జామున గొర్రెలమంద వెళ్తుండగా అతివేగంగా లారీ దూసుకు రావడంతో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలను తోలుకెళుతున్న ఇద్దరు కాపారులు తీవ్రగాయాలపాలై మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన కడప జిల్లా జమ్మలమడుగు పట్టణ శివార్లలోని శ్రీసాయి శివానీ కల్యాణ మండపం సమీపాన బైపాస్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే... నంద్యాల జిల్లా రుద్రవరం మండలానికి చెందిన గొర్రెల కాపరులు నెల రోజుల క్రితం గండికోట పరిసర ప్రాంతాల్లో గొర్రెలను మేపుకునేందుకు వచ్చారు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వారి గ్రామాలకు వెళ్లేందుకు బయలు దేరారు. గొర్రెలను తోలుకుని జమ్మలమడుగు బైపాస్‌రోడ్డు గుండా వెళుతుండగా.. అదే సమయంలో తాడిపత్రి వైపు నుంచి అతివేగంతో వచ్చిన లారీ గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. దీంతో 20 గొర్రెలు సంఘటనా స్థలంలో నుజ్జునుజ్జయి మృతిచెందాయి. గొర్రెలను తోలుకుని వెళుతున్న కాపరులు రుద్రవరం మండలం నల్లవాగుపల్లెకు చెందిన వరద చిన్నవెంకటేశ్వర్లు (45) రెండు కాళ్లు విరిగి తలకు గాయాలయ్యాయి. అలాగే ఆలమూరు గ్రామానికి చెందిన రాజుపాలెం లక్ష్మినరసింహ (35) తీవ్రంగా గాయపడ్డాడు. వీరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో వెంకటేశ్వర్లు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మినరసింహ మృతిచెందారు. గొర్రెల కాపరుల యజమాని వెనుక ఉండడం వలన ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ ఘటన జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు, ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఈ విషయం బంధువులు, కుటుంబ సభ్యులకు తెలియడంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని భోరున విలపించారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం విడుదల చేయాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం విడుదల చేయాలని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ షేక్ ఖాజా హుసేన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ సిటీ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ షేక్ జిలానీ బాషాతో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఇమామ్, మౌజమ్‌లకు కూటమి ప్రభుత్వం గత 9 నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, గత ప్రభుత్వంలో ప్రతి నెలా అకౌంట్లలో జమ అయ్యేవని, వారికి ప్రతి నెలా వేతనాలు అందేవిధంగా సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చి నిధులు విడుదల చేయాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ భవనానికి శంకుస్థాపన చేశారని, అది నిర్మాణం మధ్యలో ఆగిపోయిందని, చంద్రబాబు చొరవ తీసుకుని భవనాన్ని పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో వలిబాషా, సయ్యద్ ఖాద్రీ, అబ్దుల్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గణేశ్ నగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఇప్పటి వరకు బోర్డు గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 15న విజయవాడలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర నాయకులు బి.రాధాకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రచారం వద్దు.. అభివృద్ధి చేయండి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సంక్షేమం పేరుతో ప్రచారాలు మానుకొని.. అభివృద్ధి చేయాలని కూటమి నేతలకు ఆర్య వైశ్య డీసీసీ మాజీ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం శెట్టి సూచించారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఆటో కార్మికుడికి రూ. 15వేలు ఇస్తామని ప్రచారం చేయడం కాదని, ఆచరణలో అమలు చేయాలని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్రాల్లో రాబోయేది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు.

కెరీర్స్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు నిరుద్యోగ యువత కర్నూలు కెరీర్స్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత ప్రతి ఒక్కరూ ఈ వెబ్‌సైట్‌లో తమ తమ పేర్లల రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ సమాచారాన్ని ఈ మెయిల్ ద్వారా అందించే సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. నిరుద్యోగ యువత తమ పేర్లను కింది విధంగా పోర్టల్ లో నమోదు చేసుకోవచ్చన్నారు. కర్నూలు కెరీర్స్ మెనూ-రిజిస్టర్-జాబ్ సీకర్ బటన్‌పై క్లిక్ చేసి నిరుద్యోగ యువత మొబైల్ నెంబర్, మెయిల్ ద్వారా వారి వివరాలను నమోదు చేసుకుంటే వారికి మెయి ల్ ద్వారా నోటిఫికేషన్లు అందుతాయన్నారు. అలాగే Https://mykurnool.ap.gov.in/mykurnool /kurnool/careers.apk ద్వారా మొబైల్ యాప్‌ని కూడా డౌన్‌లోడు చేసుకోవచ్చన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

గైర్హాజరైన ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంతో నామమాత్రంగా సాగింది. ఈ సమావేశానికి ప్రజాప్రతి నిధులు హాజరు కాకపోవడంతో ప్రజల సమస్యలను వివరించే వారు లేరనీ, అధికారులు ఆడిందే ఆట. పాడిందే పాటగా తయారైందని ప్రజలు వాపోతున్నారు. సమావేశంలో మండల సమస్యలపై గానీ, అభివృద్ధిపై గానీ, సమగ్రంగా చర్చ జరిగిన దాఖలాలు లేవని వాపోతున్నారు. మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరిగనవి, జరుగుతున్నాయో మండల ప్రజలకు తెలియదు. ఈ సమావేశంలో అభివృద్ధి పనులకు వచ్చిన నిధుల ఖర్చుపై సమావేశంలో ఎవరూ అడిగినా చర్చకు దారి తీసిన దాఖలాలు లేవు. దీని వల్ల సర్వసభ్య సమావేశం ప్రతిసారి నామమాత్రంగానే కొనసాగుతుంది. మండలంలో 17 మంది ఎంపీటీసీలు ఉండగా.. 7 మంది హాజరు కాగా, సర్పంచులు 22 మంది ఉండగా.. ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. హాజరైన అధికారులు ప్రగతి నివేదికలు చదివి మమ అనిపించేశారు. మీదివేముల గ్రామానికి చెందిన ఎంపీటీసీ, మండల ఉపాధ్యక్షుడు పద్మనాభరెడ్డి మాత్రమే అధికారులను ప్రశ్నించారు. అధికారులు సమాధానం దాటవేస్తూ చెప్పారు. అయితే మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ నాగశిరీష సర్వసభ్య సమావేశం వాకిలి వద్ద అయ్యా.. మాకు జీతాలు ఇవ్వండి.. గ్రామంలో పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా సర్వసభ్య సమావేశంలో చెబుతున్నానని, అయితే అధికారులు స్పందించడం లేదని, కుమారులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టింది. ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆమె సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. జడ్పీటీసీ సభ్యులు రంగనాథగౌడు, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఏఈలు శ్రీనివాసులు, సురేంద్రనాథ్ రెడ్డి, ఏవో మధుమతి, విద్యుత్ ఏఈ సురేం ద్రబాబు, సీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్, ఎంపీటీసీలు జీకే చిన్నమ్మ, సరోజమ్మ, పుల్లయ్య, సోమశేఖర్ రెడ్డి, నాగశిరీష, పద్మనాభరెడ్డి, సర్పంచులు చదువుల సుజాతమ్మ, గోవర్దన్, అయ్యస్వామి, రామచం ద్రుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ విద్యాసాగర్

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

బస్తిపాడులో లేఅవుట్‌ను పరిశీలించిన జేసీ నవ్య


లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కల్లూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని జాయింట్ కలెక్టర్ బి.నవ్య తెలిపారు. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో బుధవారం ఆమె ఆర్డీవో సందీప్‌కుమార్‌తో కలిసి పేదలకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ బస్తిపాడులో లే అవుట్ త్వరితగతిన పూర్తి చేసి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని తహసీల్దార్ కె.ఆంజనేయులును ఆదేశిం చారు. ఇళ్లు లేని పేదలకు జీవో నంబర్ 23 ప్రకారం అర్బన్‌లో 2 సెంట్లు, రూరల్‌లో 3 సెంట్ల స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉలిందకొండ సింగిల్‌విండో డైరెక్టర్ నాగరాజు, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, ఆర్ఐ రంగస్వామి, సర్వేయర్ సుధాకర్, వీఆర్వో రామకృష్ణ, విలేజ్ సర్వేయర్ శబరి పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో క్విజ్ పోటీలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య జయంతి ఉత్సవాల సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు క్విజ్ పోటీలు ఏర్పాటు చేసినట్లు సాహితీ సదస్సు సభ్యురాలు సుబ్బలక్ష్మమ్మ తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని మాంటిస్సోరి పాఠశాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గాడిచర్ల, మేడూరిల జయంతి ఉత్సవాలను ఈనెల 14న ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు గురువారం, శనివారం క్విజ్ పోటీలు ఏర్పాటు చేశామని తెలి పారు. ఈ పోటీల్లో విజేతలకు 14న జరిగే సభలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఏపీ గ్రంథాలయ సంఘం, గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మాంటిస్సోరి పాఠ శాల ప్రధానోపాధ్యాయురాలు కె.స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు సమావేశం నగర కార్యదర్శి ఆర్. కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. మునెప్ప మాట్లాడుతూ ఈనెల 15న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు ఆదాయం లేక కుటుంబాలను పోషించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటో కార్మికులకు జీవనోపాధి కింద నెలకు రూ.5 వేల చొప్పున ఇవ్వాలని, వాహన మిత్ర ద్వారా సంవత్సరానికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, ఏఐటీ యూసీ నగర అధ్యక్షుడు బి.వెంకటేష్, కార్యదర్శి జి.చంద్రశేఖర్, డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, సహాయ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మునెప్ప

పండ్లతోటల సాగుతో అధిక లాభాలు

సి.బెళగల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చునని కోడుమూరు ఉద్యాన శాఖాధికారి మదన్‌మోహన్ అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, సంగాల గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను ఆయన పరిశీలిం చారు. మదన్‌మోహన్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటలను చౌడు భూముల్లో కూడా సాగు చేసుకోవచ్చునని అన్నారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు ముందుకు వచ్చిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి సంవత్సరానికి రూ.10,500 సబ్సిడీ అందజేస్తుందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలకులు లలిత, శశికాంత్, దేవ, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల సర్వసభ్య సమావేశం నేడు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.నాగశేషచలరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బి.శారద అధ్యక్షతన చేపట్టనున్న సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ మెంబర్లు హాజరుకావాలన్నారు. మండల అధికారులు మూడు నెలల ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : రిటైర్డ్ డీఎస్పీ

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. బుధవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-14, 17, 19 బాలబాలికలకు క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సెపక్‌తక్రా అర్చరి షూట్స్ పోటీలు జరిగాయి. 300 మంది క్రీడాకారులు హాజర య్యారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో క్రీడల్లో పాల్గొని విజయం సాధించాలన్నా రు. అనంతరం అతిథులు రిబ్బన్ కట్ చేసి పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కృష్ణ, నాగేశ్వరి, అండర్-14, 17, 19 కార్య దర్శి ఎస్.రాఘవేంద్ర, నంద్యాల జిల్లా కార్య దర్శులు విశ్వనాథ్, ఆశారెడ్డి, +2 కార్యదర్శి వ్యాయామ ఉపాధ్యాయులు సుంకారావు, పద్మలత, లక్ష్మయ్య, మల్లికార్జున, నరసింహ రాజు, శివ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో ఈ నెల 25 నుంచి 26 వరకు జరగనున్న 12వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొనే కర్నూలు సాఫ్ట్‌బాల్ జట్టు బాలబాలికల ఎంపిక పోటీలు ఈనెల 12న స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఎం.కుబేర నాయుడు, కార్యదర్శి విజయ్ తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 1.1. 2011 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డు, మీసేవా ద్వారా జనన ధ్రువీకరణ పత్రంతో ఈనెల 12న ఉదయం 9.30 గంటలకు అవుట్‌డోర్ స్టేడియంలో కోచ్ పర్వేజ్‌ను సంప్రదించాలని కోరారు. వివరాలకు 8499960254 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విజయం సాధించాలి: రాష్ట్ర స్థాయిలో ఈ నెల 26, 27 తేదీల్లో నరసరావుపేటలో జరగనున్న ఆట్యాపాట్యా పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజయం సాధించాలని అయత్ ఫౌండేషన్ అధ్యక్షుడు, రిటైర్డు డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. బుధవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో కర్నూలు జిల్లా ఆట్యా పాట్యా సంఘం ఆధ్వర్యంలో సీనియర్స్ ఎంపిక పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాగరత్నమయ్యతో కలిసి ఆయన విజేతలకు ట్రోఫీలు అందించారు.

ఉల్లి మద్దతు ధరపై ఆందోళన వద్దు


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉల్లి మద్దతు ధరపై రైతులు చెందొద్దని తహసీల్దార్ నాగరాజు, వ్యవసాయాధికారి రవిప్రకాష్ గౌడ్ అన్నారు. బుధవారం వెంకటగిరి, గోరంట్ల గ్రామాల్లో ఉల్లి రైతులతో వారు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉల్లిని కనీసం 120 రోజుల అనంతరం తొలగించాలని, తద్వారా కాయ నాణ్యత, దిగుబడి పెరుగు తుందని అన్నారు. గోరంట్లలో పొలంలో పీకి ఉంచిన ఉల్లిపంటను వారు పరిశీ లించారు.

నీటి కుంటలను తవ్వుకోవాలి: ఎంపీడీవో

సి.బెళగల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో నీటి కుంటలను తవ్వుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ రైతులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. గ్రామాల్లోని రైతులు నీటి కుంటలను పొలాల గెట్ల దగ్గర తవ్వుకోవడం వలన పొలం కోతకు గురికాదని, నీరు అంత ఒక చోట నిలుస్తోందని అన్నారు. కుంటలో నీరు నిల్వ ఉండటం వలన పంటలు బెట్ట పోకుండా ఉంటాయన్నారు.

క్రమశిక్షణ విజయానికి మెట్టు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కృషి, క్రమశిక్షణ విజయానికి మెట్టు అని సీసీఎస్ రీజనల్ హెడ్ అకడమిక్ అలయెన్సెస్ రిచర్డ్ కింగ్ చక్రగడ్డ అన్నారు. బుధవారం అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. చక్రగడ్డ మాట్లాడుతూ అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల రాయలసీమలోనే అతిపెద్ద విద్యాసంస్థ అని ప్రశంసించారు. ఈ క్యాంపస్‌లో విశాలమైన వసతి గృహాలు, ఆధునిక ప్రమాణాలు, ల్యాబోరేటరీలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

కర్నూలు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు మాల అనిల్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఆకెపోగు రాంబాబు మృతుడి కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. బుధవారం మాల అనిల్‌కుమార్ స్వగ్రామమైన మామిదాలపాడుకు ఆకెపోగు రాంబాబు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చెక్కును అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ కోసం పనిచేసే ప్రతి క్రియాశీలక సభ్యుడితో పాటు కార్యకర్తలకు సైతం పార్టీ అధినాయకత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్ర మంలో జనసేన నాయకులు మౌలాలి, నాగరాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

చంద్రబాబు దంపతుల క్షేమం కోసం పూజలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా బుధవారం నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి వార్లకు, భవానీ సమేత రామలింగేశ్వర స్వామి వార్లకు పూజలు చేయించారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం గౌరవ సలహాదారు టీవీ రవిచంద్రశర్మ, అర్చక పురోహిత సంఘం నాయకులు కంచుగంటల శ్యామసుందర్‌రావు, దేవెళ్ల వసంత సాయినాథ శర్మ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి వివాహ దినోత్సవాన్ని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిపోగు బజారన్న, మంత్రాలయం బీసీ సెల్ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, నరసింహనాయుడు, బేతం కృష్ణుడు పాల్గొన్నారు

టీడీపీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో..

సీఎం చంద్రబాబు దంపతుల వివాహ దినోత్సవం టీడీపీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. టీడీపీ కార్యాలయంలో సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వి.హనుమంతరావు చౌదరి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పద్మా చౌదరిలు చంద్రబాబు, భువనేశ్వరి ఫ్లెక్సీల ముందు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు.


పూజలు చేస్తున్న నగర బ్రాహ్మణ సంఘం నాయకులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


రికార్డు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గూడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు తనిఖీలు చేప ట్టారు. బుధవారం గూడూరులోని సత్యనారాయణ ట్రేడింగ్ కంపెనీ, రామకృష్ణ ట్రేడర్స్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్స్‌మెంట్ ఏవో విశ్వనాథన్, గూడూరు వ్యవసాయాధికారి దస్తగిరిరెడ్డి తనిఖీలు చేశారు. ఈ దుకాణాల్లో రికార్డులు సరిగ్గా నిర్వహించకపోవడంతో సత్యనారాయణ ట్రేడింగ్ కంపెనీ షాపులో 9.435 టన్నుల ఎరువులు దీని విలువ రూ.1,89,234లు, అలాగే రామకృష్ణ ట్రేడర్స్ షాపులో 10.290 టన్నుల ఎరువులు, వీటి విలువ రూ.3,28,233 తాత్కాలిక అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏవో దస్తగిరిరెడ్డి తెలిపారు.

అమీలియో హాస్పిటల్‌కు ఎన్ఏబీహెచ్ గుర్తింపు



ఎన్ఏబీహెచ్ ప్రమాణ పత్రంతో అమీలియో ఆస్పత్రి ఎండీ డాక్టర్ లక్ష్మీప్రసాద్ చాపే

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మెరుగైన సేవలు అందిస్తున్న కర్నూలు అమీలియో హాస్పిటల్‌కు నేషనల్ అక్రిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపు లభించింది. ఈ మేరకు అమీలియో హాస్పిటల్ ఎన్ఏబీహెచ్ జాబితాలో చేరినట్లు హాస్పిటల్ మేనే జింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ చాపే వెల్లడించారు. బుధవారం ఎన్ఏబీహెచ్ బోర్డు నుంచి ప్రమాణ పత్రం అందుకున్న సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేసి ఆయన కేక్ కట్ చేశారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ చాపే మాట్లాడుతూ ఆసుపత్రిలో ఆరోగ్య సేవల్లో తమ నాణ్యత ప్రమాణాలతో సేవలు అందిస్తున్నామని, దీని విశిష్టతను ఎన్ఏబీహెచ్ గుర్తించడంతో ప్రమాణ పత్రం అందుకున్నట్లు తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో చికిత్స

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో అత్యుత్తమ చికిత్స అందుబాటులో ఉందని ఇంటర్నేషనల్ క్లాసికల్ హోమియోపతి కన్సల్టెంట్ సీనియర్ హోమియోపతి వైద్యులు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. రోగి, శారీరక, మానసిక వ్యాధి లక్షణాలను పరిగణనలోకి తీసుకుని రోగ నిర్ధారణ జరిపి, సరైన మందును మోతాదులో ఇచ్చి చికిత్స చేయడం వల్ల మొండి, దీర్ఘకాలిక వ్యాధులు సైతం శాశ్వతంగా తొలగిపోయే అవకాశం ఉందన్నారు. అక్యూట్ వ్యాధులైన జలుబు, దగ్గు, ఆయాసం, మలేరియా టైఫాయిడ్ వాంతులు, విరేచనాలు, వడదెబ్బకు చికిత్స అందుబాటులో ఉందన్నారు.

17 నుంచి కోదండరామస్వామి ఏకాదశి వ్రత మహాయజ్ఞం

ఓర్వకల్లు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామంలో వెలసిన కోదండ రామస్వామి 1100వ ఏకాదశి వ్రత మహాయజ్ఞం ఈ నెల 17వ తేదీ నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బి.విశ్వేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. 17న ఆలయంలో గణపతి పూజ, కలశ స్థాపన, పంచ సూక్తములు, స్వామివారికి అభిషేకం, ఆకుపూజ, హోమాలు, పురోహితులు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో అఖండ భజనలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 18న స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ ఉంటా యని చెప్పారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

గొల్లలదొడ్డిలో 'పొలం పిలుస్తోంది'

సి.బెళగల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మండలంలోని రైతులకు యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులకు యూరియా కొరత లేదు యూరియా అందరికి అందుబాటులో ఉందన్నారు. ఎంపీఈవో వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

గూడూరు: రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి దస్తగిరిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చనుగొండ్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఏవో మాట్లాడుతూ నానో యూరియా ఉపయోగాల గురించి వివరించారు. పత్తి పంటలో గులాబి రంగు. రసం పీల్చు పురుగుల యజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఉల్లి పంట వేసిన రైతులు గ్రేడింగ్ చేసుకుని మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాలని సూచించారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

ఆదోని టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ బుధవారం తెలిపారు. బసాపురం చెరువు నుంచి వేసిన తాగునీటి పైపులకు మరమ్మతులు చేస్తున్న కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రజలు సహకరించాలని కోరారు.

రసాయనాల వినియోగం తగ్గించాలి



సాగు పుస్తకాలను అందిస్తున్న వ్యవసాయాధికారులు

తుగ్గలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనక ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని ఏవో సురేష్ బాబు, జిల్లా వనరుల శాఖ అధికారి రంగారెడ్డి అన్నారు. బుధవారం పీఎం వికాస్ యోజన శిక్షణ ఇచ్చి, పుస్తకాలను అందజేశారు. నానో యూరియాతో ఖర్చు తక్కువ అని, దుష్ప్రభావాలు ఏండవపాకపసేజ ఏఈవోలు లక్ష్మీనారాయణ, మల్లేష్, రైతులు విజయభాస్కర్, హయ్యత్‌బాషా తదితరులు ఉన్నారు

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

మద్దికెర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని జడ్పీటీసీ సభ్యుడు మురళిధర్ రెడ్డి, సర్పంచ్ బండారు సుహాసిని, వైసీపీ నాయకుడు రేలంపాడు వెంకటేశ్వర్లు, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు కోరారు. బుధవారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 134 రైల్వేస్టేషన్‌లలో రైళ్లను నిలుపుదల చేస్తున్నట్లు ఇచ్చిన ఉత్తర్వులలో మద్దికెర లేకపోవడం బాధాకరమన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మద్దికెర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రోత్సహించాలని హెచ్ఎం ఉమ, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు మెడికల్ తిమ్మప్ప అన్నారు. బుధవారం పెరవలి జడ్పీ పాఠశాలలో గ్రామానికి చెందిన దాత పారా రవికుమార్ విద్యార్థులకు ప్రోత్సహకాలతో పాటు క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేయడంతో సన్మానించారు.

ఆత్మహత్య పరిష్కారం కాదు

ఆదోని టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని క్లినికల్ సైకాలజిస్ట్ అన్విత్ అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోబుల్ ఒకేషనల్ కళాశాలలో ఆత్మహత్యల నివారణ సదస్సును నిర్వహించారు.



మాట్లాడుతున్న అన్విత్

లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ గోపీనాథ్ మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యకు పాల్పడటం విషాదకరమన్నారు. క్లబ్ జిల్లా చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారెడ్డి, శ్రీనాథ్ గుప్తా, విశిష్ట సభ్యులు డాక్టర్ ఉష, లలిత, జితేంద్ర ఉన్నారు.

నిధులు రాళ్లపాలు



పక్క చిత్రంలో కనిపిస్తున్నవి ఏవో పనికిరాని రాళ్లు లేదా గృహ నిర్మాణంలో వృథా అయినవి అనుకుంటున్నారా! కాదండీ.. గత వైసీపీ హయాంలో రీ సర్వే అనంతరం పాతేందుకు తెచ్చిన సరిహద్దు రాళ్లు. రూ.వేలు ప్రజాధనం ఖర్చుచేసి ఇలా చెన్నంపల్లి సచివాలయం వద్ద పడేశారు. అధికారులు వీటిని ఇతర ప్రజోపయోగ పనులకు వాడితే మేలని ప్రజలు కోరుతున్నారు.

\- తుగ్గలి

వాస్తు దోషమట..!

కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం ఎంపీడీవో కార్యాలయ భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రధాన తలుపును వాస్తుదోషం పేరుతో మూసివేసి, చిన్న తలుపును తెరిచారు. తహసీల్దార్ మాట్లాడుతూ విధులకు ఆటంకమన్న కారణంగా మూసివేశామన్నారు.

\- దేవనకొండ



ఆందోళన వద్దు.. ఉల్లిని కొనుగోలు చేస్తాం

● కలెక్టర్ రంజిత్ బాషా



ఈదుల దేవరబండలో ఉల్లి రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్

దేవనకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉల్లిని కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని, కలెక్టర్ పి.రంజిత్ బాషా హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని ఈదుల దేవరబండ వద్ద గ్రామంలో ఉల్లి రైతులతో మాట్లాడారు. ఉల్లిని ఆరబెట్టి, గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తెస్తే కొనుగోలు చేస్తామన్నారు. మనగ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేసి, యూరియా నిల్వలను అడిగి తెలుసుకున్నారు. యూరియా కొరత లేకుండా చుస్తామని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం జడ్పీ పాఠశాలకు వెళ్లి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదవి పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రాథమిక వైద్యశాలలో తనిఖీ చేశారు. వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, కె. వెంకటాపురం గ్రామానికి చెందిన తిమ్మయ్య అనే వ్యక్తి కలెక్టరు దృష్టికి తీసుకొచ్చారు. 6వ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకి నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు.పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దార్ రామాంజినేయులు, డీప్యూటీ ఎంపీడీవో గోపాల్, ఏవో ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళిమోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివలింగమ్మ, వైద్యాధికారి విజయభాస్కర్, తదితరులు ఉన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను వినియోగించుకోవాలని ఏవో వెంకటేశ్వరగౌడ్ సూచించారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో 80 శాతం రాయితీ కింద డ్రోన్‌ను హత్తిబెళగల్ సిద్దేశ్వర గ్రూపుకు పంపిణీ చేశారు. డ్రోన్ సాయంతో వ్యవసాయంలో పురుగుల మందు పిచికారీ, తదితర పనులు సులువవుతాయన్నారు. ఏఈవో శివప్రసాద్, యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



కిసాన్ డ్రోన్‌ను పంపిణీ చేస్తున్న ఏవో వెంకటేశ్వరగౌడ్

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

ఆలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న కార్యకర్త, 3 ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో నరసమ్మ బుధవారం ప్రకటనలో కోరారు. హొళగుంద మండలం బి.జి.హళ్లి-1 పోస్టు బీసీ-ఈకు రిజర్వు అయ్యిందన్నారు. అలాగే చిప్పగిరి మండలం ఏరూరు-1 బీసీ-ఈ, హొళగుంద మండలం కోగిలతోట-1 బీసీ-బీ, నెరణికి 2వ కేంద్రంలో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఒక పోస్టు రిజర్వు అయ్యిందన్నారు. కార్యకర్త పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఆయాకు 7వ తరగతి పాస్ కావాలన్నారు. 1-7-2025 నాటికి 21-35 సంవత్సరాల్లోపు, స్థానికులుగా ఉండాలన్నారు. ఈనెల 17వ తేదీన సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో అందించాలని ఆమె కోరారు.

దేవనకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ 3వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు, బండపల్లి గ్రామంలో అంగన్‌వాడీకేంద్రం టీచరు పోస్టులకు దరకాస్తు చేసుకొవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివలింగమ్మ తెలిపారు. ఈనెల 17లోగా సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకొవాలన్నారు.

జిల్లాకు సంజీవయ్య పేరును పెట్టాలి



మీనాక్షి నాయుడికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు తొలి దళిత సీఎం మచ్చలేని దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని దామోదరం సంజీవయ్య జిల్లా సాధన కమిటీ కార్యదర్శులు కల్లుబోతుల రంగన్న, వాసు బాబు, కుంకనూరు వీరేష్ కోరారు. బుధవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యేలు మీనాక్షి నాయుడు, సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆంజనేయులు, నరసన్న, రమేష్ పాల్గొన్నారు.

ఆదోని జిల్లా ఏర్పాటుకు సహకరించాలి

ఆదోని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లా ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. బుధవారం అనంతపురంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, జిల్లా ఇన్‌చార్జిమ మంత్రి నిమ్మల రామానాయుడికి వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో మాట్లాడారు. అంతేగాకుండా ఆదోని మండలంలో దాదాపు 44 గ్రామాలున్నాయని, నాలుగు మండలాలుగా విభజించాలని కోరారు. రహదారులు విస్తరణ, ఆక్రమణల తొలగింపు కు దాదాపు రూ.60కోట్లు అవసరమవుతాన్నారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రితో ఎమ్మెల్యే



మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

మతోన్మాదంపై పోరాడదాం

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో సీతారామ్ ఏచూరి వర్థంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఏచూరి దేశంలోనే గొప్ప రాజకీయ నాయకుడున్నారు. చిన్ననాటి నుంచే అభ్యుదయ భావాలకు ప్రభావితమై రాజధాని జేఎన్‌యూ యూనివర్సిటీకి మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు. వెంకటేశ్వరరెడ్డి, గోపాల్, దస్తగిరి, రంగారెడ్డి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాలువలోని పైపులైన్లు తొలగించారు

తుగ్గలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామంలో కాలువలో ఉన్న పైపులైన్లను పంచాయతీ సిబ్బంది తొలగించి, మురుగును శుభ్రం చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'మురుగు కాలువలో పైపులైన్లు' కథనానికి స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర, సర్పంచ్ లడ్డా కమల్ సిబ్బందిని పంపారు. ప్రజలు ఇంటి నుంచి మురుగునీటి రోడ్డుపైకి వదలవద్దన్నారు. అలాగే ఓవర్ హెడ్ ట్యాంకు తోపాటు, రెండు గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయించినట్లు తెలిపారు.



పైపులైన్లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

జిల్లేడు బుడకల సర్పంచ్ మృతి

దేవనకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెడుబుడకల గ్రామ సర్పంచు గోసి హనుమంతు (65) మృతిచెందారు. కొన్ని రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు గత శనివారం కర్నూలు వైద్యశాలకు తరలించారు. మంగళవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. డీప్యూటీ ఎంపీడీవో గోపాల్ కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియలకు రూ.10 వేలు అందజేశారు.



హనుమంతు(ఫైల్)

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

ఆదోని రూరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో జనార్ధన్ సూచించారు. బుధవారం మాట్లాడుతూ రోజూ తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లాలని తెలిపారు. విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.



ఎంపీడీవో జనార్ధన్

సీఎం సభకు తరలిన నాయకులు



ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో టీడీపీ నాయకులు

తుగ్గలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నిర్వహించిన సీఎం సభకు ఎమ్మెల్యే శ్యాంబాబు, నాయకులు బుధవారం తరలి వెళ్లారు. తుగ్గలి, తదితర గ్రామాల నుంచి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, ట్రైబల్ వెల్ఫేర్ సలహా మండలి సభ్యుడు వెంకటపతి, తిమ్మయ్య చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, వెంకటస్వామి, మిద్దె వెంకటేశ్ యాదవ్ తరలివెళ్లారు.

చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం



పత్తికొండలో జ్యోతులను ఊరేగిస్తున్న భక్తులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవ వేడుకలు భక్తులు నిర్వహించారు. తెల్లవారుజామున చౌడేశ్వరిదేవి ప్రతిమను పల్లకీలో ఉంచి ఊరేగించారు. అనంతపురం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన తొగట క్షత్రియులు జ్యోతులను నెత్తిపై పెట్టుకొని పాటలతో నృత్యాలు చేశారు. నాలుగుస్తంభాల కూడలిలో పట్టణవాసులు తరలివచ్చి ఈ జ్యోతుల మహోత్సవాన్ని తిలకించారు.

ఆత్మహత్యల నివారణపై నేడు సదస్సు



డిప్యూటీ డీఎంహెచ్‌వోను ఆహ్వానిస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యల నివారణకు గురువారం పట్టణంలోని ఏపీఎన్‌జీవో భవనంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షురాలు ఉషారాణి, కార్యదర్శి బజారి తెలిపారు. బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి, మానసిక వైద్యుడు డాక్టర్ చైతన్యను ఆహ్వానించామన్నారు. క్షణికావేశంతో, పరీక్షల్లో ఫెయిలయ్యామని, కుటుంబ కలహాలు, రైతులు పంట నష్టపోయి, ప్రేమ విఫలమై యువత ఆత్మహత్యకు పాల్పడటంతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మహత్యల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

రాజశ్యామల హోమం

వెల్దుర్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామం భీమలింగేశ్వర ఆలయంలో నిర్వాహకులు లక్ష్మీరెడ్డి బుధవారం రాజశ్యామల హోమం నిర్వహించారు. ఉత్సవమూర్తిని అలంకరించి యాగశాల ఏర్పాటుచేసి శ్రీశైల దేవస్థానం వీరశైవ విద్యార్థులుహోమం నిర్వహించారు. జ్యోతిష్య పండితుడు బత్తయ్యస్వామి సమక్షంలో పూలు చేశారు.

వరి రైతులకు యూరియా

ఆదోని రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరి రైతులందరికీ యూరియాను అందజేస్తామని ఏడీఏ బాలవర్ధిరాజు, ఏవో సుధాకర్ తెలిపారు. బుధవారం బసాపురం రైతు సేవాకేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఒక్క రోజే 76 టన్నుల యూరియాను పంపిణీ చేవామన్నారు. రైతులు నానో యూరియా వాడేందుకు అలవర్చుకోవాలని సూచించారు.


ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీడీపీ నాయకులు జగన్నాథ్ ఆచారి, తెలుగు యువత మండల కార్యదర్శి కావలి రాజశేఖర్ కోరారు. ఈమేరకు బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా స్థలాలు ఇచ్చారన్నారు. ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామంలో గ్రామ కంఠం సర్వేనంబర్ 934-935 నెంబర్‌లో 3.5 ఎకరాలు ఉండగా గత వైసీపీ ప్రభుత్వం 1.55 ఎకరాల్లో స్థలాలకు ఇచ్చిందన్నారు. లో మిగిలిన రెండు ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అ ఒక్కరికీ 3 సెంట్ల చొప్పున ఇవ్వాల కోరామన్నారు. స్పందించిన అధ్యక్షుడు పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడితో నాయకులు

భయబడి



మూఢనమ్మకంతో మూతపడిన మోడల్ స్కూల్ హాస్టల్

- ఏడాదైనా ముందుకు రాని విద్యార్థులు
- తెరుచుకోని వసతిగృహం
- నిరూపయోగంగా 25 గదులు
- శిథిలావస్థకు చేరుకుంటున్న వైనం



మూతపడిన మోడల్ స్కూల్ హాస్టల్

మూఢనమ్మకంతో ఏకంగా 25 గదులు మూతపడ్డాయి. ఈ భవనాల్లోకి రావాలంటేనే విద్యార్థులు హడలెత్తిపోతున్నారు. ఏడాదికి ముందు ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి తాము ఈ భవనాల్లో ఉంటే ఎక్కడ ఏమి జరుగుతుందోనని భయపడుతున్నారు. అధికారులు రకరకాలుగా అవగాహన కల్పిస్తున్నా.. గదుల్లోకి ఒక్కరూ కూడా రావడం లేదు. దీంతో చేసేది ఏమి లేక సంవత్సరం నుంచి మంత్రాలయం మోడల్ స్కూల్ హాస్టల్ తాళాలకే పరిమితమయ్యాయి. గదుల్లో ఎవరూ లేకపోవడంతో శిథిలావస్థకు చేరి, భవన సామగ్రి దొంగలపాలవుతున్నాయి.

మంత్రాలయం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్‌లో ఏడాది పూర్తయినా హాస్టల్ తెరుచుకోవడం లేదు. హాస్టల్‌లో విద్యార్థులను చేర్పించేందుకు గతంలో పని చేసిన ఇక్కడి ప్రిన్సిపాల్ పట్టించుకోలేదు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేసి 9, 10, ఇంటర్ బాలికలు హాస్టల్‌లో చేరాలని, మూఢ నమ్మకాలు వదిలి ప్రభుత్వం అందిస్తున్న హాస్టళ్ల సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. 2024, ఆగస్టు 5న పదో తరగతి చదువుతున్న సుంకేశ్వరి గ్రామానికి చెందిన కురువ పార్వతి హాస్టల్ భవనంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి విద్యార్థినులు హాస్టల్‌లో చేరేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఈ హాస్టల్ నిర్వహణకు వార్డెన్, వంట మనిషి, వాచ్‌మెన్, స్వీపర్లను నియమించింది. గత ఏడాదిగా ప్రభుత్వం వీరికి జీతాలు ఇస్తూ వస్తుంది. గత రెండు నెలలు క్రితం వార్డెన్, స్వీపర్‌లు రాజీనామా చేయడంతో వంట మనిషి, వాచ్‌మెన్లు



మాత్రమే రోజూ గదులను శుభ్రపరుస్తున్నారు. అయితే.. విద్యార్థులు లేకపోవడంతో 25 గదులు నిరూపయోగంగా మారడమే కాకుండా పశువుల కాపర్లు, రైతుల చేతుల్లో కిటికీల అద్దాలు ధ్వంసమవుతున్నాయి. విద్యార్థులు లేకపోవడంతో హాస్టల్ మూతపడటం, శిథిలావస్థకు చేరింది. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు దాదాపు 143 మంది బాలికలు వివిధ గ్రామాల నుంచి ఆటోలు, బస్సులు, మోటారు సైకిళ్లపై నానా ఇబ్బందులు పడుతూ పాఠశాలకు వచ్చి వెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏపీ మోడల్ స్కూల్ నిర్వహించాలని చేపట్టినప్పటికీ ఇక్కడ హాస్టల్‌కు మూఢనమ్మకంతో తెరుచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానిక ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు, విద్యార్థులు వెంటనే హాస్టల్‌లో చేరేలా చర్యలు తీసుకోవాలి.

విద్యార్థినుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం



ఏడాది క్రితం ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడంతో మూఢనమ్మకంతో చాలా మంది విద్యార్థినులు హాస్టల్‌లో చేరకపోవడం బాధాకరం. విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులకు అనేకమార్లు సమావేశం నిర్వహించి హాస్టల్ స్థితిగతులపై అవగాహన కల్పించాం. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్‌లో చేర్పించేలా కృషి చేస్తా.

- అశోక్ నాయక్, ప్రిన్సిపాల్
ఏపీ మోడల్ స్కూల్, రచ్చుమర్రి



దెబ్బతిన్న మంచాలు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న రావూస్ కళాశాల సీఈవో తిరుమల రెడ్డి

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రావూస్ కళాశాల సీఈవో తిరుమల రెడ్డి అన్నారు. వినాయక చవితి సందర్భంగా పట్టణంలో వివేకానంద ప్రీమరి లీగ్ సంస్థ నిర్వహించిన క్రికెట్ పోటీల్లో రావూస్ కళాశాల విద్యార్థులు పాల్గొని విన్నర్‌గా నిలిచి కప్పు సాధించారు. దీంతో బుధవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సుజనా రెడ్డి, ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ వెంకటేష్, పీడీలు ధనుంజయ, గోవిందు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకం వరం లాంటిది : బీజేపీ



వాషింగ్ మిషన్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

నందవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం వరం టాంటిదని బీజేపీ నాయకుడు గురురాజరావు అన్నారు. బుధవారం నందవరంలో విశ్వకర్మ పథకం కింద వచ్చిన వాషింగ్ మిషన్లను పంపిణీ చేశారు. గతంలో రూ 250 కట్టి దరఖాస్తు చేసుకున్న రజకులకు అర్హులైన వారికి 40 వాషింగ్ మిషన్లు వచ్చాయని, బీజేపీ నాయకులు బీఎల్ నారాయణ, మాజీ సర్పంచ్ రామన్నగౌడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు,శివ, టీమేష్, విక్టర్,శ్రీను బైలుప్పల బాష పాల్గొన్నారు.

ప్రచార యాత్రను జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నందవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికై యూటీఎఫ్ చేపడుతున్న ప్రచార యాత్రను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప కోరారు. బుధవారం నందవరంలో గౌరవ అధ్యక్షుడు దావీదు ఆధ్వర్యంలో రణబేరి పోస్టర్లు విడుదల చేశారు. 15 నుంచి 19 వరకు కర్నూలు మీదగా విజయవాద వరకు చేపట్టే ప్రచారయాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విరుపాక్షి, నాగరాజు, మద్దయ్య, మహలక్ష్మీ, ఉమాదేవి,, నారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు: విజయవాడలో జరిగే రణభేరి యాత్రను జయప్రదం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షులు ప్రశాంత్‌భూపాల్, శంకరయ్య పిలుపునిచ్చారు. బుధవారం పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రణభేరీ యాత్ర కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాసులు, సువర్ణజోషి, నిస్సార్ బాషా, రాజేశ్వరి, మురళి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా



యూరియా బస్తాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

నందవరం, సెక్టంబరు 10(ఆంధ్రజ్యోతి): నందవరం మండల రైతులకు యూరియా అందుబాటులో ఉందని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నందవరంలో యూరియా బస్తాలను ఏవో సరిత ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నందవరంకు 12,6 మెట్రిక్ టన్నులు, నాగలదిన్నె శివకిరణ్ ట్రేడర్స్‌కు 8 మెట్రిక్ టన్నులు, నందవరం కోరమాండల్‌కు 5 మెట్రిక్ టన్నులు,, కిసాన్ అగ్రిమాల్‌కు 5 మెట్రిక్ టన్నులు ప్రకారం వచ్చిందని రైతులందరు యూరియా తీసుకోవచ్చన్నారు. వారి వెంట డీటీ సతిష్ పాల్గొన్నారు.

పరిమళ ప్రసాదం కౌంటరులో నాలుగు కొత్త మిషన్లు ఏర్పాటు

మంత్రాలయం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో భక్తులకు అందించే పరిమళ ప్రసాదం కౌంటరులో నాలుగు మిషన్లు రూ.4లక్షలతో కొనుగోలు చేశామని, ఈ మిషన్ల ద్వారా ప్రసాదం టోకన్లు భక్తులు ఇవ్వనున్నట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఒక్కో మిషన్ రూ.లక్ష చొప్పున నాలుగు మిషన్లు కొనుగోలు చేసి ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నామన్నారు. పరిమళ ప్రసాదంతో పాటు వివిధ సేవలకు సైతం ఈ మిషన్లను వినియోగించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ధార్మిక పర్యటనలో పీఠాధిపతి

మంత్రాలయం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో బాగంగా బుధవారం బెంగుళూరుకు బయలుదేరి వెళ్లారు. తన 13వ చాతుర్మాస (49రోజులు) దీక్షలు ముగిసిన తర్వాత మొదటిసారిగా ధార్మిక పర్యటనకు వెళ్లారు. గురువారం మధ్యాహ్నం వరకు బెంగులూరులో వివిధ పూజల్లో పాల్గొంటారు. అనంతరం తమిళనాడులోని శ్రీరంగానికి బయలుదేరి వెళ్తారు. అక్కడ పీఠాధిపతికి భారీ ఊరేగింపు, తులాభారం చేయనున్నారు. ధార్మిక పర్యటన ముగించుకొని శుక్రవారం ఉదయానికి మంత్రాలయానికి చేరుకుంటారని మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కేశ్రీనివాసరావు, సురేష్‌కోణాపూర్ తెలిపారు.

అంగరంగ వైభవంగా ప్రహ్లాదరాయల ఊంజల సేవ



ప్రహ్లాదరాయలకు ఊంజల సేవ చేస్తున్న పండితులు

మంత్రాలయం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు అంగరంగా వైభవంగా ఊంజలసేవ చేశారు. భాద్రప్రద తదియ శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవ్రేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణ బోధ పూజ మందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల మధ్య వివిధ రథాలపై వజ్రాలు పొదిగిన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ అంగరంగా వైభవం గా ఊరేగించారు. భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేష వ స్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

సీఐటీయూను బలోపేతం చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూను మరింత బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం సీఐటీయూ నాలుగో మహాసభ ఘనంగా ముగిసింది. రాధాకృష్ణ, గోవిందులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల సాధనకై సమర శీల ఉద్యమాలకు కార్మికులు సన్నద్ధం కావాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఎన్నికల తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ చట్టాలరు రద్దు చేయాలని కనీస వేతనంన ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కార్మికులందరికీ 62 ఏళ్ల సర్వీసును జీవోను విడుదల చేయాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు గోవిందు, ప్రధాన కార్యదర్శి రాము డు, కోశాధికారి ఖాజాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాగలక్ష్మీ, రమేష్, శైలజ, తిమ్మప్ప పాల్గొన్నారు.

రూ.5 లక్షల చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దృశ్యం

కోసిగి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోల్‌మాన్ పేట గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రీయాశీలక సభ్యుడు గిరయ్య ప్రహ్లాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జనసేన పార్టీ తరఫున రూ.5 లక్షల చెక్కును బుధవారం కోల్‌మాన్‌పేట గ్రామంలో కార్యకర్త గిరయ్య ప్రహ్లాద్ భార్య శ్రావణికి, తల్లికి చెక్కును అందజేశారు కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వీరారెడ్డి, టీడీపీ యువ నాయకులు జ్ఞానేష్, జనసేన పార్టీ నాయకులు నరసింహులు, మారెప్ప, అంజి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి కొనుగోలు కేంద్రానికి స్థల పరిశీలన

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ఉల్లి కొనుగోలు చేసేందుకు ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో స్థలాన్ని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణ మూర్తి, మార్కెఫెడ్ డీఎం రాజు బుధవారం పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్‌లో వెనుక భాగంలో ఉన్న గోడౌన్‌లను, షెడ్‌లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరులో ఉల్లి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మార్కెట్ ఆవరణంలో ఉల్లి కొనుగోలు చేసేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. త్వరలో కేంద్రం ఏర్పాటు చేసి ఉల్లి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీరి వెంట స్థానిక మార్కెట్ ఛైర్మన్ మల్లయ్య, మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులను నాణ్యతతో చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కోసిగి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ప్రధాన రోడ్లపై గుంతలను నాణ్యతతో మరమ్మతులు పనులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ అన్నారు. బుధవారం కోసిగిలోని సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ కోసిగి ప్రధాన రోడ్డులో నిర్మాణ మరమ్మతుల కోసం మంజూరైన నిధులను దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చడంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని, ఇప్పటికైనా కాంట్రాక్టరు, ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లపై ఉన్న గుంతల మరమ్మతులను నాణ్యతతో చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు తాయన్న, ఓంకార్ స్వామి, సీపీఐ, రైతు సంఘం నాయకులు నరసింహులు, శ్రీనివాసులు, చార్లెస్, సిద్ధూ తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

కోసిగి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోసిగి మేజర్ పంచాయతీ పరిధిలో సర్పంచ్ సంజీపోగు కుమారి అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం దోమల నివారణకు పంచాయతీ కార్మికుల చేత ఫాగింగ్ చేయించారు. వారు మాట్లాడుతూ కోసిగిలో దోమల బెడద తీవ్రంగా ఉండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు జ్వరాల పడ్డారు. దీంతో దోమల బెడద అధికంగా ఉందని, అందులో భాగంగానే కోసిగిలో 1వ వార్డులో ఫాగింగ్‌ను చేశారు. కాచి వడబోసిన నీరు తాగాలన్నారు. కార్యక్రమంలో మాణిక్య రాజు, రాజేష్ పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఏవో శివశంకర్

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియా, డీఏపీతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో శివశంకర్ తెలిపారు. బుధవారం ఎమ్మిగనూరు మండలంలోని పార్లపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నానోయూరియా, డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీ వాడకం వలన మొక్కకు నేరుగా పోషకాలు అందించడమే కాకుండా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి వచ్చే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వినోద్, రమేష్, వీఏఏలు రాజేష్, రైతులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల కోసం పోరాటం



కరపత్రాలను విడుదల చేస్తున్న దళిత నాయకులు

గోనెగండ్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): దళితుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం సాగిస్తామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవాసహాయం, బీఆర్ అంబేడ్కర్ భవనసాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌చైతన్య అన్నారు. గోనెగండ్లలో బుధవారం జిల్లా డప్పు కళాకారులు సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 13న ఎమ్మిగనూరు పట్టణంలో కుర్ణికళ్యాణ మండపంలో రాజకీయ పార్టీలక అతీతంగా దళిత సమ్మేళన సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో గోనెండ్ల ఎంపీటీసీ తాయప్ప, రంగస్వామి, పెద్దలు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని బీజేపీ నందవరం మండలం నాయకులు గురురాజ్ దేశాయ్, బీజేపీ జిల్లా కార్యదర్శి దయసాగర్ కోరారు. అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం కొద్ది రోజుల నుంచి వారు నిరసనలు చేపడుతున్నామన్నారు. బుధవారం నాయకులు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణానికి స్థలం కేటాయించినప్పటికీ, పనులు ప్రారంభం కాలేదన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి స్పందించి నిధులు కేటాయించి, భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి రామ్‌చరణ్, రామన్న గౌడ్, శిల్పి భాస్కర్, గోపాల్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ, రామకృష్ణ ఆశయాలు కొనసాగిస్తాం



మాట్లాడుతున్న గురు శేఖర్

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ, సత్తనపల్లి రామకృష్ణ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఏపీ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురు శేఖర్, సిద్ధప్ప, రత్నమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో చాకలి ఐలమ్మ, రామకృష్ణల వర్ధంతి సందర్భంగా వారికి పూలమాలలు వేసి నాయకులు నివాళి అర్పించారు. అనంతరం డీఎస్సీలో ఉపాధ్యాయులగా ఎన్నికైన రజకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భరత్, రేణుక, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నల్లారెడ్డి స్వాముల ఉత్సవాలు

● ముస్తాబైన ఆలయం

గోనెగండ్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల సమీపంలో చింతలాముని నల్లారెడ్డిస్వాముల దశమి ఉత్సవాలు 12 నుంచి 16 వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 12న రాత్రి 2 గంటలకు పల్లకిసేవతో స్వామి వారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 13న దశిమి ఉత్సవం, 14న సాంస్కృతిక కార్యక్రమాలు, 15న పారువేట ఉత్సవం, 16న ఆరాధన ఉత్సవంతో స్వామివారి దశమి ఉత్సవం ముగుస్తుంది. ఉత్సవాలకు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర నుంచి భక్తులు తరలివస్తారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా దేవాలయ నిర్వాహకులు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఉచిత భోజన సౌకర్యం, రాత్రి బస కార్యక్రమాలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ విజయభాస్కర్ ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఎక్కువగా నల్లారెడ్డి, మునిస్వాముల పేర్లే:

గ్రామంలో కొలువైన చింతలాముని, నల్లారెడ్డి స్వాముల పేరుతో ఎక్కువ మంది ఉన్నారు. చాల మంది తమకు పుట్టిన బిడ్డలకు స్వామి వారి పేర్లు పెట్టుకుంటు మొక్కులు తీర్చుకుంటారు. ఎక్కువగా నల్లారెడ్డి స్వామి పేరును నల్లరెడ్డి, నల్లన్నగా, చింతలామునిస్వామి పేరును మునిస్వామి, మునెప్పగా, ఆడబిడ్డకైతే మునెమ్మగా పిలుచుకుంటారు.

పాడి పంటలకు తెలిపే అశ్వం నడక

చింతాలముని, నల్లారెడ్డి స్వాములు ఇద్దరు గురుశిష్యులు వారు చిన్న నాటి నుంచి చూపిన మహిమలను ఈ ప్రాంతవాసులు కథలుగా చెప్పుకుంటారు. 12న తెల్లవారు జామున జరిగే స్వామి వారి అశ్వసేవా ఎంతో ప్రాముఖ్యతను చోటుచేసుకుంది. అశ్వాన్ని సాక్షత్తు స్వామి వారి రూపంగా భక్తులు కొలుస్తారు. స్వామి వారి





అశ్వాన్ని ప్రత్యేకంగా అలంకరించి దేవాలయంలో పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 2 గంటలకు ఓబులేసు స్వామి దేవాలయం నుంచి అశ్వాన్ని మేళతాళలతో ఊరేగిస్తు చింతలాముని నల్లారెడ్డి స్వామి దేవాలయానికి చేరుకుంటారు. అ దారిలో భక్తులు అశ్వానికి పళ్ల, పూలు సమర్పిస్తారు. అశ్వం కదిలే కదలికలను బట్టి ఆ ఏడాది పాడి పంటలు ఉంటాయాని భక్తుల నమ్మకం.